

గద్దర్ అవార్డులు..
గద్దర్ పేరుతో రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన అవార్డుల్లో జిల్లా నేపథ్యం కలిగిన రెండు చిత్రాలకు అవార్డులు దక్కాయి. - 10లో



ట్రిపుల్ ఐటీ పిలుస్తోంది
బాసర, మహబూబ్‌నగర్ ట్రిపుల్ ఐటీల్లో 2025-26 విద్యా సంవత్సరానికి ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలైంది. - 10లో

గరిష్టం/కనిష్టం
34°/27°

వాతావరణం
మేఘావృతమై ఉంటుంది. ఉరుములతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఫర్టిలైజర్ షాపుల్లో తనిఖీలు



రికార్డులు పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి

ఆలేరు: పట్టణంలోని ఫర్టిలైజర్ దుకాణాల్లో మండల వ్యవసాయాధికారి శ్రీనివాస్ శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. విత్తనాలు, ఎరువుల స్టాక్ రిజిస్టర్లు, ప్యాకెట్లపై తయారీ, గడువు తేదీ తదితర వివరాలను ఆయన పరిశీలించారు. నకిలీ, నిషేధిత విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీలర్లను హెచ్చరించారు. రైతులకు సరిపోను ఎరువులు, విత్తనాలను అందుబాటులో ఉంచాలన్నారు. స్టాక్ వివరాలను ప్రతి రోజూ బోర్డులపై నమోదు చేయాలని స్పష్టం చేశారు.

సహకార సంస్థలను అనుసంధానించాలి



మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి

నల్లగొండ టౌన్ : సహకార సంస్థలను జాతీయస్థాయిలో అనుసంధానం చేయాలని జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ) చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ ప్రధాన కార్యాలయంలో పాడి సహకార సంఘాలను డీసీసీబీలతో అనుసంధానం చేసిన సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 2025–2026ను అంతర్జాతీయ సహకార సంవత్సరంగా ప్రకటించిన సందర్భంగా జాతీయస్థాయిలో సహకార సంస్థలను అనుసంధానం చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. సహకార సంఘాలను అనుసంధానం చేయడం వల్ల సహకార వ్యవస్థ బలోపేతం అవుతుందన్నారు. ప్రాథమిక పాడి సహకార సంఘాలు డీసీసీబీలో సేవింగ్ ఖాతా ఓపెన్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో డీసీఓ పత్యానాయక్, సీఈఓ శంకర్‌రావు, జీఎం నర్మద, బ్యాంకు డీజీఎంలు, ఏజీఎంలు, పాడి సహకార సంఘాల చైర్మన్లు పాల్గొన్నారు.

ఉపకార వేతన దరఖాస్తు గడువు పొడిగింపు

భువనగిరిటౌన్ : 2024–25 విద్యాసంవత్సరానికి గాను ఉపకార వేతనాల దరఖాస్తు గడువు జూన్ 31 వరకు పొడిగించినట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి వసంతకుమారి తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో చదువుతున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనార్టీ విద్యార్థులు http://telanganaepass.cgg.gov.in (E&ParsoPortal) వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

బెస్ట్ అవైలబుల్ పథకానికి..
బెస్ట్ అవైలబుల్ పథకం కింద ఇంగ్లిష్ మాధ్యమంలో చదువుకునేందుకు ఎస్సీ విద్యార్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు ఎస్సీ అభివృద్ధి జిల్లా అధికారి వసంతకుమారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 1వ తరగతి (డే స్కాలర్), 5వ తరగతి (రెసిడెన్షియల్) విద్యార్థినీ, విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. జిల్లాలో 1వ తరగతి 60 సీట్లు, 5వ తరగతి 62 సీట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ నెల 31వ తేదీ దరఖాస్తులు స్వీకరిస్తామని పేర్కొన్నారు. జూన్ 20న 11 గంటలకు కలెక్టరేట్‌లో డ్రా ద్వారా విద్యార్థులను ఎంపిక చేయనున్నట్లు వెల్లడించారు.

అభివృద్ధికి పునరంకితం

ఉమ్మడి జిల్లా సర్వతోముఖాభివృద్ధి రాష్ట్రానికి మార్గదర్శకం కావాలి

- పేదల సంక్షేమానికి అధికారులు కట్టుబడి పనిచేయాలి
- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు
- సూర్యాపేటలో ఉమ్మడి జిల్లా సమీక్ష సమావేశం
- హాజరైన మంత్రులు కోమటిరెడ్డి, ఉత్తమ్ ఎంపీ,ఎమ్మెల్యేలు,ఎమ్మెల్సీలు



సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, చిత్రంలో మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి, ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి, ప్రభుత్వ విప్ ఐలయ్య, ఎమ్మెల్యేలు మందుల సామేలు, బత్తుల లక్ష్మారెడ్డి, కుందూరు జైవీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, రైతు కమిషన్ సభ్యుడు చెవిటి వెంకన్న, ఉమ్మడి జిల్లా కలెక్టర్లు

భానుపురి (సూర్యాపేట) : రాష్ట్ర అవతరణ దినోత్సవం నుంచి అధికారులంతా అభివృద్ధికి పునరంకితం కావాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు పిలుపునిచ్చారు. సూర్యాపేట, నల్లగొండ, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో ధాన్యం కొనుగోళ్లు, వ్యవసాయం, ఇందిరమ్మ ఇళ్లు, భూ భారతి చట్టంపై శుక్రవారం సూర్యాపేట జిల్లా కలెక్టరేట్‌లో మంత్రులు నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ అధికారులు నిర్లిప్తత వదిలేసి పేదల సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తూ ఉమ్మడి జిల్లాను అన్నింటా అగ్రస్థానంలో నిలపాలన్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా సర్వతోముఖాభివృద్ధి.. రాష్ట్రానికి మార్గదర్శకంగా నిలవాలని పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లాకు ఈ సంవత్సరం లక్ష మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన గోదాములను మంజూరు చేస్తామని, ఇందుకుగాను స్థలాన్ని కేటాయించాలని మూడు జిల్లాల కలెక్టర్లను కోరారు. నల్లగొండ జిల్లాకు అదనంగా ఏఈఓలు కావాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చేసిన విజ్ఞప్తి మేరకు వ్యవసాయ విస్తరణ అధికారులను నియమించుకునే అధికారం కలెక్టర్లకు ఇచ్చామని మంతిర పేర్కొన్నారు.

పవర్‌పాయింట్ ప్రజెంటేషన్..
సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్.. ధాన్యం సేకరణ, ఇందిరమ్మ ఇళ్లు, భూ భారతి, వ్యవసాయంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. అలాగే నల్లగొండ కలెక్టర్ ఇలా త్రిపాఠి, యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు ఆయా జిల్లాలకు సంబంధించిన వివిధ అంశాలను సమీక్ష సమావేశంలో వెల్లడించారు. ఈ సమావేశంలో సూర్యాపేట ఎస్పీ నరసింహ, రాష్ట్ర పర్యాటక శాఖ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి, వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ సభ్యుడు చెవిటి వెంకన్నయాదవ్, సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వంగవీటి రామారావు, ఉమ్మడి జిల్లా అధికారులు పాల్గొన్నారు.



సమీక్షకు హాజరైన సూర్యాపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల అధికారులు

కలెక్టర్లదే ముఖ్యపాత్ర

- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



కేబినెట్ నిర్ణయాలను అమలు చేయడంలో కలెక్టర్లదే ముఖ్యపాత్ర అని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాను అన్నింటా ముందుంచేలా అధికారులు కృషి చేయాలన్నారు. నల్లగొండ జిల్లాలో ధాన్యం ఉత్పత్తి ఎక్కువగా ఉన్నందున అదనపు గోదాములు మంజూరు చేయడమే కాకుండా, క్లస్టర్లను, ఏఈఓ పోస్టులను మంజూరు చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రికి విజ్ఞప్తి చేశారు. తన శాఖ ద్వారా ఉమ్మడి నల్లగొండ జిల్లాకు అత్యధికంగా రూ.1,700 కోట్లను కేటాయించామని పేర్కొన్నారు.

వేగంగా ఇరిగేషన్ పనులు

- మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



ఉమ్మడి జిల్లాలో రానున్న ఐదేళ్ల కాలంలో ఇరిగేషన్ పనులు వేగంగా చేపట్టి అన్ని ప్రాజెక్టులను పూర్తిచేస్తామని రాష్ట్ర నీటి పారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లాలో ఈ ఏడాది అత్యధికంగా ధాన్యం సేకరించిన కలెక్టర్లను, ప్రత్యేకించి నల్లగొండ కలెక్టర్ ఇలా త్రిపాఠిని అభినందించారు. వచ్చే సీజన్ నుంచి అన్ని కొనుగోలు కేంద్రాలకు ధాన్యం శుభ్రపరిచే, ఆరబెట్టే యంత్రాలను ఇస్తామని పేర్కొన్నారు. అడిగిన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డు ఇచ్చేలా చర్యలు తీసుకుంటున్నామని, రానున్న రోజుల్లో సన్నబియ్యంతోపాటు, ఇతర రేషన్ సరుకులు ఇవ్వనున్నట్లు మంత్రి వెల్లడించారు. సూర్యాపేట జిల్లాలో ఫారెస్ట్ భూములన్నింటికి తిరిగి పచ్చదనం తెచ్చేలా తన కోటా నుంచి నిధులు ఇస్తానని ప్రకటించారు. విధి నిర్వహణలో అధికారులు అలసత్వం వీడాలన్నారు. రెవెన్యూ, పోలీస్ శాఖల్లో ఎలాంటి అవినీతి, అక్రమాలు, లంచగొండితనం ఉండొద్దన్నారు.

ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఏం మాట్లాడారంటే..

- భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ధాన్యం సేకరణలో మిల్లర్లు రైతులను ఇబ్బందులు పెట్టకుండా, ఇందిరమ్మ ఇళ్ల జాబితాలో అనర్హులు లేకుండా చూడాలని కోరారు.
- ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఐలయ్య మాట్లాడుతూ తన నియోజకవర్గంలో ముందుగానే ధాన్యం సేకరణ పూర్తి చేయడంతో రైతులు సంతోషంగా ఉన్నారన్నారు.
- మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి లబ్ధిదారులకు ఇసుక ఇచ్చేందుకు మిర్యాలగూడలో ఇసుక డంప్ యార్డ్ ఏర్పాటు చేయాలని కోరారు.
- నాగార్జునసాగర్ ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి మాట్లాడుతూ రైతులకు వానాకాలం పంటలపై అవగాహన కల్పించాలని కోరారు.
- ఎమ్మెల్సీ శంకర్ నాయక్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంలో అర్హులకు ఇందిరమ్మ ఇల్లు రావడం సంతోషంగా ఉందన్నారు.
- ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ ధాన్యం సేకరణలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతరావు, చిత్రంలో డీసీపీ, అధికారులు, మత పెద్దలు

ఈద్గాల్లో సౌకర్యాలు కల్పించండి

- కలెక్టర్ హనుమంతరావు

భువనగిరిటౌన్ : బక్రీద్ పండుగ సందర్భంగా జూన్ 7న ఈద్గాల వద్ద మౌలిక వసతులు కల్పించాలని కలెక్టర్ హనుమంతరావు అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన శాంతి సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ఈద్గాల వద్ద పారిశుద్ధ్య చర్యలు చేపట్టడంతో పాటు విద్యుత్, తాగునీటి సౌకర్యం కల్పించాలని సూచించారు. వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ పడేయకుండా ఇంటింటికీ వేస్టేజ్ కవర్లు పంపిణీ చేయాలని స్పష్టం చేశారు. పశువులను తరలించడానికి, వధించడానికి తప్పనిసరిగా పశు వైద్యాధికారిచే ధ్రువీకరణ పొందాలన్నారు. చెక్‌పోస్టుల వద్ద రెవెన్యూ, పశు సంవర్ధక శాఖ అధికారులు పర్యవేక్షిస్తుండాలన్నారు. డీసీపీ అక్షాంశ్ యాదవ్ మాట్లాడుతూ బక్రీద్ రోజు పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తామని, ప్రశాంతమైన వాతావరణంలో పండుగ జరుపుకోవాలని కోరారు. సమావేశంలో అడిషనల్ ఏసీపీ లక్ష్మీనారాయణ, భువనగిరి ఆర్డీఓ కృష్ణారెడ్డి, డీపీఓ సునంద, జిల్లా పశు వైద్యాధికారి యాదయ్య, మతపెద్దలు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల సందర్శన
వలిగొండ : మండలంలోని గోకారం, సంగెం గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాలను శుక్రవారం కలెక్టర్ హనుమంతరావు సందర్శించి ధాన్యాన్ని పరిశీలించారు. వర్ష సూచన ఉన్నందున త్వరగా కొనుగోళ్లు పూర్తి చేయాలని, కాంటా వేసిన వడ్లను ఎప్పటికప్పుడు మిల్లులకు ఎగుమతి చేయాలని కేంద్రాల నిర్వాహకులను ఆదేశించారు. ఆయన వెంట ఆర్డీఓ శేఖర్ రెడ్డి, డీఆర్‌డీఓ నాగిరెడ్డి, సివిల్ సప్లై అధికారులు, తహసీల్దార్ ఉన్నారు.

అందని నెట్ సిగ్నల్స్, సర్వర్ బిజీ

ఫార్మర్ రిజిస్ట్రీకి ఆటంకాలు

- మందకొడిగా కొనసాగుతున్న ప్రక్రియ
- జిల్లాలో 2,80,524 మంది రైతులు
- రోజుకు వంద మంది లోపే నమోదు



రామన్నపేటలోని రైతు వేదికలో వివరాలు నమోదు చేయించుకుంటున్న రైతులు

రామన్నపేట : ప్రతి రైతుకూ 11 అంకెల యూనిక్ కోడ్‌తో గుర్తింపు కార్డులు జారీ చేసేందుకు చేపట్టిన రైతుల నమోదు (ఫార్మర్ రిజిస్ట్రీ)కు సాంకేతిక సమస్యలు ఎదురవుతున్నాయి. గ్రామాల్లో నెట్‌సిగ్నల్స్ సరిగా అందకపోవడం, సర్వర్ బిజీ వస్తుండటంతో రైతుల వివరాల నమోదు మందకొడిగా సాగుతోంది. ప్రక్రియ ప్రారంభమై 10 రోజులు దాటినా 33,483 మంది రైతుల వివరాలు మాత్రమే నమోదు చేయగలిగారు.

వ్యవసాయ పథకాలకు ప్రామాణికం ఇదే..!
కేంద్ర ప్రభుత్వం రైతుల కోసం పీఎం కిసాన్, పంటల బీమా, మౌళిక సదుపాయాల కల్పన తదితర పథకాలను అమలు చేస్తున్న విషయం తెలిసిందే. సరైన వివరాలు, ధ్రువీకరణ, నమోదు వివరాలు లేకపోవడంతో పథకాలు రైతులకు సక్రమంగా అందడం లేదు. దీన్ని గుర్తించిన కేంద్ర ప్రభుత్వం 11 అంకెల యూనిక్ కోడ్‌తో గుర్తింపు కార్డు జారీ చేయాలని నిర్ణయించింది. తెలంగాణ రాష్ట్రంలో అగ్రిస్టాక్ తెలంగాణ ఫార్మర్ రిజిస్ట్రీ పేరుతో రైతుల వివరాలు అమలు చేస్తోంది. పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్, ఫోన్ నంబర్‌తో వ్యవసాయ విస్తరణ అధికారుల వద్ద వివరాలు నమోదు చేస్తే రైతు సెల్‌ఫోన్‌కు ఓటీపీ వస్తుంది. ఓటీపీ ధ్రువీకరణ ద్వారా రైతుకు విశిష్ట గుర్తింపు సంఖ్య కేటాయిస్తారు. ఆధార్‌కార్డుతో అనుసంధానమైన పట్టాదారు పాసుపుస్తకంలోని భూ యాజమాన్య వివరాల నమోదు ద్వారా రైతుకు గుర్తింపు కార్డు జారీ చేయనున్నారు. వ్యవసాయ శాఖ లెక్కల ప్రకారం జిల్లాలో 2,80,524 రైతులు ఉన్నారు. వీరందరికీ గుర్తింపు కార్డులు జారీ చేయాల్సి ఉంది. ఈనెల 20వ తేదీన వెబ్‌పోర్టల్‌లో ఫార్మరీ రిజిస్ట్రీని అధికారులు ప్రారంభించారు.

సమయం ఎక్కువ తీసుకుంటుంది



ఫార్మర్ రిజిస్ట్రేషన్ కోసం ఆధార్‌కార్డు తీసుకొని రైతువేదికకు వెళ్లాను. రెండు గంటలు వేచి ఉన్న తరువాత నా వంతు వచ్చింది. మా వివరాలు నమోదు చేయడానికి పది నిమిషాల సమయం పట్టింది. మూడుసార్లు ఓటీపీ వచ్చింది. సర్వర్ బిజీ ఉండడం వల్ల చాలా సమయం తీసుకుంటుంది. చాలా మంది రైతులు ఇటువంటి పరిస్థితినే ఎదుర్కొంటున్నారు.

–వరికుప్పల మల్లేశం, రైతు

అవరోధాలు..

సరైన నెట్‌వర్క్ లేకపోవడం, రాష్ట్రవ్యాప్తంగా నమోదు ప్రక్రియ ఒకేసారి జరుగుతుండడంతో సర్వర్ బిజీగా వస్తుంది. ఒక పాసుబుక్ వివరాల నమోదుకు మూడు పర్యాయాలు ఓటీపీ రావడం, 30 సెకన్ల వరకే ఓటీపీ ననమోదుకు గడువు ఉండడం, ఆధార్‌కార్డుతో లింక్ అయిన ఫోన్ అందుబాటులో లేకపోవడం తదితర కారణాల వల్ల నమోదు ఆలస్యం అవుతుంది. ఒక్కోసారి వివరాలన్నీ నమోదు చేసి చివరి ఓటీపీ కన్‌ఫామ్ చేసుకునేలోపు లాగ్‌అవుట్ అవుతుంది. తిరిగి మొదటి నుంచి నమోదు చేయాల్సి వస్తుంది.ఒక్కో ఏఈఓ రోజంతా 80 నుండి 100 మంది రైతుల వివరాలు మాత్రమే నమోదు చేయగలుగుతున్నారు.

రైతులంతా నమోదు చేయించుకోవాలి



ఆధార్ కార్డు మాదిరిగా ప్రతి రైతుకు 11 అంకెలతో కూడిన డిజిటల్ కార్డు కేంద్రం జారీ చేయనుంది. ప్రారంభంలో టెక్నికల్ సమస్యలు ఉత్పన్నమయ్యాయి. వాటిన్నంటినీ అధిగమించడంతో ప్రస్తుతం నమోదు వేగంగా జరుగుతుంది. కేంద్రం ఇచ్చే రాయితీలు, పథకాలు డిజిటల్‌కార్డు ఆధారంగా వర్తించే అవకాశం ఉంది. రైతులంతా వివరాలు నమోదు చేయించుకోవాలి.

– గోపాల్, జిల్లా వ్యవసాయాధికారి

సర్కారు బడి సరికొత్తగా..

తుది దశకు వసతుల కల్పన

- జిల్లాలో 558 స్కూళ్లకు 548 పాఠశాలల్లో పనులు పూర్తి
- విద్యాసంవత్సరం పునఃప్రారంభం నాటికి లక్ష్యం చేరిక



వంగపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కుళాయిలతో తాగునీటి సౌకర్యం కల్పించిన దృశ్యం



వలిగొండ మండలం ప్రొద్దటూరు ప్రాథమికోన్నత పాఠశాలకు రంగులు

భువనగిరి : ప్రభుత్వ పాఠశాలల్లో సమస్యల పరిష్కారానికి అమ్మ ఆదర్శ కమిటీల ఆధ్వర్యంలో చేపట్టిన పనులు తుది దశకు చేరాయి. ఇప్పటి వరకు 98 శాతం పూర్తికాగా నూతన విద్యా సంవత్సరం పునఃప్రారంభం నాటికి వంద శాతం పూర్తయ్యేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. రంగులు, వసతుల కల్పనతో పాఠశాలలు నూతన రూపు సంతరించుకున్నాయి.

558 పాఠశాలలు ఎంపిక
ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో తాగునీరు, మూత్రశాలలు, మరుగుదొడ్లు, విద్యుత్, భవన మరమ్మతులు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం జిల్లాలో 715 పాఠశాలలు ఉండగా వీటిలో 558 పాఠశాలలను ఎంపిక చేసింది.పనులను అమ్మ ఆదర్శ కమిటీలకు అప్పగించగా గత ఏడాది ఏప్రిల్, మే నెలలో ప్రారంభించారు. 2024 జూన్ 12లోపు పనులు పూర్తికావాల్సి ఉండగా నిధుల కొరత, వివిధ కారణాల వల్ల కొనసాగుతూనే ఉన్నాయి. ఈ విద్యా సంవత్సరం జూన్ 12వ తేదీ నాటికి వంద శాతం పనులు పూర్తి చేయాల్సి ఉంది.

రూ.23.81 కోట్లు విడుదల.. ఎంపిక చేసిన పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన కోసం ప్రభుత్వం రూ.23.81 కోట్లు విడుదల చేసింది. 558 పాఠశాలలకు గాను 548 పాఠశాలల్లో పనులు పూర్తయ్యాయి. ఇంకా 10 పాఠశాలల్లో పూర్తి చేయాల్సి ఉంది. ప్రధానంగా కాంట్రాక్టర్, నిర్వాహకులు అందుబాటులో లేకపోవడంతో పనుల పూర్తి చేయడంలో జాప్యం జరిగినట్లు తెలుస్తోంది.

వందశాతం పూర్తి చేస్తాం

ఎంపిక చేసిన పాఠశాలల్లో పనులు దాదాపు పూర్తి కావొచ్చాయి. మిగిలిన పాఠశాలల్లోనూ విద్యా సంవత్సరం పునఃప్రారంభం నాటికి పూర్తయ్యేలా పర్యవేక్షిస్తున్నాం. పాఠశాలల్లో విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా వసతులు కల్పించి ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

– సత్యనారాయణ, డీఈఓ

రాష్ట్ర ఆవిర్భావ వేడుకలకు ముఖ్య అతిథిగా గుత్తా

సాక్షి, యాదాద్రి : తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జూన్ 2వ తేదీన యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో నిర్వహించే వేడుకలకు ముఖ్య అతిథిగా శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి హాజరుకానున్నారు. ఈ మేరకు శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు. 2వ తేదీ ఉదయం కలెక్టరేట్‌లో జాతీయ పతాకాన్ని గుత్తా సుఖేందర్‌రెడ్డి ఆవిష్కరించి, పోలీస్ గౌరవ వందనం స్వీకరించనున్నారు. అనంతరం జిల్లా ప్రగతి నివేదికపై ప్రసంగించనున్నారు. అంతకు ముందు పట్టణంలోని తెలంగాణ అమర వీరుల స్థూపం వద్ద పుష్పాంజలి ఘటించనున్నారు. అదే విధంగా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు నియోజకవర్గాల్లోని తమ కార్యాలయాల వద్ద జాతీయ జెండాలు ఎగురవేయనున్నారు. కలెక్టర్, డీసీపీ ఇతర శాఖల అధికారులు వారి కార్యాలయాలు, గ్రామ పంచాయతీల్లో కార్యదర్శులు జాతీయ పతాకాన్ని ఎగురవేయాలని సీఎస్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. రాష్ట్ర ఆవిర్భావ వేడుకలను పండుగ వాతావరణంలో నిర్వహించాలని స్పష్టం చేశారు.

200 పని దినాలు కల్పించాలి



కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న ఉపాధిహామీ కూలీలు, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం, డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ నాయకులు

భువనగిరిటౌన్ : 200 రోజుల పని దినాలు కల్పించాలని, రోజు కూలి రూ.600 చెల్లించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం ఉపాధిహామీ కూలీలు తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. అనంతరం కలెక్టరేట్ ఏఓకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. ఉపాధిహామీ కూలీలకు ప్రస్తుతం చెల్లిస్తున్న కూలి దేనికీ చాలడం లేదన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా కూలి పెంచాలని, అడిగిన ప్రతి ఒక్కరికీ పని కల్పించాలని డిమాండ్ చేశారు. ఉపాధిహామీ చట్టానికి కేంద్ర బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కొండమడుగు నర్సింహ, రాష్ట్ర కమిటీ సభ్యుడు గంగదేవి సైదులు, జిల్లా సహాయ కార్యదర్శులు సిర్పంగి స్వామి, గుంటోజు శ్రీనివాసాచారి, పల్లెర్ల అంజయ్య, కూకుట్ల చొక్కాకుమారి, డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ జీఎంపీఎస్, ప్రజా నాట్యమండలి నాయకులు గడ్డం వెంకటేష్, బొలగాని జయరాములు, దయ్యాల నరసింహ లావుడియా రాజు, పబ్బోజు రాదమ్మ , రామలీల, యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

యువకుడిపై దాడి.. కేసు నమోదు

గరిడేపల్లి: దారివ్వమని అడిగినందుకు యువకుడిపై దాడి చేసిన ఘటనలో శుక్రవారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ చలికంటి నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. గరిడేపల్లి మండల పరిధిలోని కాల్వపల్లి గ్రామానికి చెందిన దుపాటి మోహన్ హుజూర్‌నగర్ పట్టణంలో డిగ్రీ పరీక్షలు రాసి తిరిగి బైక్‌పై ఇంటికి వస్తున్నాడు. మార్గమధ్యంలో గ్రామానికి చెందిన మామిడి రమేష్ ఇంటి ముందుకురాగానే మండలంలోని రాయినిగూడెం గ్రామానికి చెందిన సిద్ధు, హుజూర్‌నగర్ పట్టణానికి చెందిన సంపత్, జీవన్, నరేష్, మాధవరాయినిగూడెం గ్రామానికి చెందిన కాటబోయిన విష్ణు, నిమ్మల విష్ణు మరికొంత మంది యువకులు డీజే పాటలు పెట్టుకుని డ్యాన్స్ చేస్తున్నారు. వారిని దారి ఇవ్వమని అడిగినందుకు మోహన్‌పై దాడి చేసి గాయపర్చారు. ఈమేరకు మోహన్ తల్లి దుపాటి నాగలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శుక్రవారం తెలిపారు.

డీజే నిర్వాహకుడిపై కేసు

గరిడేపల్లి: మండల పరిధిలోని కాల్వపల్లి గ్రామానికి చెందిన గణేష్ వివాహం సందర్భంగా అనుమతి లేకుండా డీజే పెట్టినందుకు డీజే నిర్వాహకుడు, వాహనం సీజ్ చేసినట్లు ఎస్‌ఐ చలిగంటి నరేష్ శుక్రవారం తెలిపారు. గురువారం రాత్రి కాల్వపల్లి గ్రామంలో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా చనగాని నర్సింహరావు అనుమతి లేకుండా డీజే నిర్వహిస్తుండడంతో అతడిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

వంట గ్యాస్ పైపు లీకేజీ

సంస్థాన్ నారాయణపురం: మండల కేంద్రంలో శుక్రవారం ఇంటిలో వంట గ్యాస్ పైపు లీకేజీ కావడంతో మంటలు అంటుకున్నాయి. మండల కేంద్రానికి చెందిన కర్నాటి పాండు ఇంట్లో కుటుంబసభ్యులు వంట చేస్తుండగా స్టౌవ్‌కు ఉన్న పైపు వద్ద గ్యాస్ లీకేజీ అయి మంటలు వచ్చాయి. ఆందోళన చెంది బస్తాలు కప్పడంతో బస్తాకు మంటలు అంటుకుని పొగ అలుముకుంది. పోలీసులు, ఫైర్ స్టేషన్ అధికారులు అక్కడకు చేరుకున్నారు. తడి బస్తాలు కప్పి మంటలు ఆర్పివేశారు. రెగ్యులేటర్ ఆఫ్ చేసి, సిలిండర్‌ను ఇంటి నుంచి బయటకు తీసుకురావడంతో ప్రమాదం తప్పింది.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి


లక్ష్మీనారాయణ (ఫైల్)

మఠంపల్లి: మండలంలోని రఘునాథపాలెం గ్రామానికి చెందిన గోపిశెట్టి లక్ష్మీనారాయణ(28) శుక్రవారం ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. స్థానికులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. లక్ష్మీనారాయణ స్థానికంగా మిషన్ భగీరథ మంచినీటి సరఫరా విభాగంలో తాత్కాలిక ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. గ్రామ పరిధిలో గల తన వ్యవసాయ పొలంలో నీళ్లు పెట్టేందుకు వెళ్లాడు. విద్యుత్ మోటార్ ఆన్ చేస్తే పనిచేయలేదు. ట్రాన్స్‌ఫార్మర్ నుంచి విద్యుత్ సరఫరా నిలిచిపోయిందని భావించి ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలిస్తుండగా.. ప్రమాదవశాత్తు ట్రాన్స్‌ఫార్మర్ వైరు తగిలి షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్యా, ఇద్దరు పిల్లలున్నారు. ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని మఠంపల్లి పోలీసులు తెలిపారు.

ట్రిపుల్ ఐటీ పిలుస్తోంది

- బాసర, మహబూబ్‌నగర్ ట్రిపుల్ ఐటీల్లో 2025-26లో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల
- నేటి నుంచి 21వ తేదీ వరకు దరఖాస్తుల స్వీకరణ
- జూలై 4న ఎంపిక జాబితా
- ఈ ఏడాది నుంచే ప్రారంభంకానున్న మహబూబ్‌నగర్ ట్రిపుల్‌ఐటీలో 180 సీట్లు కేటాయింపు


బాసర ట్రిపుల్ ఐటీ క్యాంపస్

పెద్దవూర: రాష్ట్రంలోని రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వ విద్యాలయం(ఆర్జీయూకేటీ) పరిధిలోని బాసర, మహబూబ్‌నగర్ ట్రిపుల్ ఐటీలలో 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలైంది. బాసర ట్రిపుల్ ఐటీలో 1500, ఈ యేడాది ప్రారంభం కానున్న మహబూబ్‌నగర్ ట్రిపుల్ ఐటీలో 180 సీట్లు కేటాయించారు. ఆరేళ్ల బీటెక్ సమీకృత కోర్సులో చేరేందుకు అర్హులైన విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని అధికారులు పేర్కొంటున్నారు.

ప్రవేశ అర్హతలు

2025లో నిర్వహించిన ఎస్ఎస్‌సీ, తత్సమాన పరీక్షల్లో రాష్ట్రంలో గుర్తింపు పొందిన పాఠశాలలో రెగ్యులర్‌గా ఉత్తీర్ణులై ఉండాలి. 31-12-2024 నాటికి 18 ఏళ్లు నిండకూడదు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 21 ఏళ్లు నిండకూడదు. బాసర ట్రిపుల్ ఐటీలో మొత్తం 1500 సీట్లకు గాను 85శాతం సీట్లు రాష్ట్ర వాసులకే కేటాయించారు. మిగతా 15శాతం సీట్లు ఓపెన్ కేటగిరిలో తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన మెరిట్ విద్యార్థులకు ప్రవేశం కల్పించనున్నారు.

రిజర్వేషన్లు ఇలా..

ఎస్సీలకు 15శాతం, ఎస్టీలకు 6శాతం,బీసీ-ఏ 7శాతం, బీసీ-బీ 10శాతం, బీసీ-సీ 1 శాతం, బీసీ-డీ 7శాతం, బీసీ-ఈ 4శాతం, ప్రత్యేక కేటగిరీలో దివ్యాంగులకు 3శాతం, ఈడబ్ల్యూఎస్ 10 శాతం, సైనికోద్యోగుల పిల్లలకు 2శాతం, ఎన్‌సీసీ విద్యార్థులకు 1శాతం, స్పోర్ట్స్ కోటా కింద 0.5శాతం భర్తీ చేస్తారు. రెండు తెలుగు రాష్ట్రాల విద్యార్థులకు కాకుండా వేరే రాష్ట్రాల వారికి, భారతీయ పౌరసత్వం కలిగిన అంతర్జాతీయ విద్యార్థులకు, గల్ఫ్ దేశాల్లో పనిచేస్తున్న భారతీయుల పిల్లలకు అదనపు సీట్లు కేటాయిస్తారు. అన్ని విభాగాల్లో బాలికలకు 33.33శాతం ప్రవేశాల్లో రిజర్వేషన్ పాటిస్తారు. విద్యార్థులు మీసేవా, పీఎస్ ఆన్‌లైన్ సెంటర్ల ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రూ.450, ఓసీ, బీసీ విద్యార్థులకు రూ.500, ఇతర రాష్ట్రాల అభ్యర్థులకు రూ.1500 లు, ఎన్ఆర్ఐ అభ్యర్థులు 100 యూఎస్ డాలర్లు ప్రవేశ రుసుం చెల్లించాల్సి ఉంటుంది. సెంటర్ సర్వీస్ చార్జీ కింద మరో రూ.25లు వసూలు చేయనున్నారు.

ప్రవేశ విధానం

పదో తరగతిలో సాధించిన మార్కుల ఆధారంగా మెరిట్ పద్ధతిలో ప్రవేశాలు కల్పిస్తారు. ప్రభుత్వం, నాన్ రెసిడెన్షియల్ పాఠశాలలు, ఇతర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో చదివిన విద్యార్థులకు వెనుకబాటు సూచిక కింద 4శాతం మార్కులు(ప్రతి సబ్జెక్టుకు 4 మార్కులు మొత్తం 24 మార్కులు) విద్యార్థికి వచ్చిన పదో తరగతి మార్కులకు జత కలిపి ప్రవేశాల్లో ప్రాధాన్యత కల్పిస్తారు. సీట్ల కేటాయింపు సందర్భంలో సమాన మార్కులు వస్తే అభ్యర్థులకు సబ్జెక్టు వారీగా వచ్చిన మార్కులకు ప్రాధాన్యత ఇస్తారు. మొదట గణితం, తర్వాత జనరల్ సైన్స్, ఆ తర్వాత ఇంగ్లిష్, ఆ తర్వాత సోషల్ స్టడీస్‌లో ఎక్కువ మార్కులు వచ్చిన వారికి ప్రాధాన్యం ఇస్తారు. ఇవన్నీ సమానంగా ఉంటే ఫస్ట్ లాంగ్వేజ్‌లో సాధించిన మార్కులను పరిగణలోకి తీసుకుంటారు. గ్రేడ్ పాయింట్లు సమానమైతే విద్యార్థి పుట్టిన తేదీ ప్రకారం పెద్ద వయస్సు ఉన్నవారికి అవకాశం ఇస్తారు. ఇవి సమానంగా ఉంటే హాల్ టికెట్ నంబర్‌ను పరిగణలోకి తీసుకుని ఎంపిక చేస్తారు.

కౌన్సిలింగ్‌లో సమర్పించాల్సిన ధ్రువపత్రాలు

దరఖాస్తు చేసుకున్న సమయంలో పేర్కొన్న పత్రాలన్నింటిని కౌన్సిలింగ్‌కు వచ్చే సమయంలో దగ్గర ఉంచుకోవాలి. ఆన్‌లైన్ దరఖాస్తు ఫారం ప్రింట్ అవుట్, దరఖాస్తు చేసుకున్న రశీదు, ఆధార్ కార్డు, పదో తరగతి హాల్ టికెట్, మార్కుల షీటు, రెసిడెన్షియల్ సర్టిఫికెట్, కుల ధ్రువీకరణ పత్రాలు, వికలాంగులైతే వైకల్య ధ్రువీకరణ పత్రం, సైనికోద్యోగుల పిల్లలు సంబంధిత అధికారి జారీ చేసిన ధ్రువపత్రం, ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్, ఎన్‌సీసీ, స్పోర్ట్స్ కోటా అభ్యర్థులైతే సంబంధిత అధికారి జారీ చేసిన ధ్రువపత్రాలు సమర్పించాలి. కౌన్సిలింగ్‌కు ఎంపికైన విద్యార్థుల జాబితా యూనివర్సిటీ వెబ్‌సైట్ www.rgukt.ac.in లేదా www.admissions.rgukt.ac.in లో ప్రదర్శించనున్నారు.

ముఖ్యమైన తేదీలు

నోటిఫికేషన్ తేదీ: 28-05-2024
ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రారంభం తేదీ : 31-05-2025
దరఖాస్తుల స్వీకరణకు చివరి తేదీ : 21-06-2025
ప్రత్యేక అవసరాలు గల, స్పోర్ట్స్, ఎన్‌సీసీ విద్యార్థులకు చివరి తేదీ : 25-07-2025
ఎంపిక జాబితా ప్రకటన : 04-07-2025
మొదటి విడత కౌన్సిలింగ్ : 07-07-2025

ఫీజుల వివరాలు

- ప్రవేశం పొందిన విద్యార్థులు ట్రిపుల్ ఐటీలో 6 సంవత్సరాలు విద్యను అభ్యసించాల్సి ఉంటుంది. ఇందులో ఇంజినీరింగ్ సంబంధించిన అన్ని కోర్సులు ఉంటాయి.
- మొదటి రెండేళ్లు ఏడాదికి రూ.36 వేలు, ఆ తర్వాత నాలుగేళ్లు ఏడాదికి రూ.40వేల చొప్పున చెల్లించాల్సి ఉంటుంది.
- ప్రభుత్వం చెల్లించే ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకానికి అర్హులైన విద్యార్థులకు ఎలాంటి ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదు. వీరికి ల్యాప్‌ట్యాప్, మూడు జతల షూలు, హాస్టల్ వసతి ప్రభుత్వమే సమకూర్చుతుంది.
- రిజిస్ట్రేషన్ ఫీజు కింద ఓసీ, బీసీ అభ్యర్థులు రూ.1000లు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.500లు చెల్లించాలి.
- క్యాష్ డిపాజిట్ కింద ఏ కేటరిగి అభ్యర్థులైనా రూ.2000లు చెల్లించాలి. దీనిని తిరిగి ఇస్తారు.
- పరీక్ష రుసుము రూ.1000లు, వైద్య బీమా రూ.500లు చెల్లించాలి.
- మొదటి రెండు సంవత్సరాలకు సుమారుగా సంవత్సరానికి అడ్మిషన్ సమయంలో మొత్తం రూ.3700లు(ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.3200) చెల్లించాల్సి ఉంటుంది.
- ఇతర రాష్ట్రాలు, గల్ఫ్ దేశాల్లో పనిచేసే వారిపిల్లలు ఏడాదికి రూ.1.37 లక్షలు, ఎన్నారై విద్యార్థులు రూ. 3,01,000 ట్యూషన్ ఫీజు చెల్లించాలి.

ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి


మాట్లాడుతున్న పల్లా వెంకట్ రెడ్డి

సూర్యాపేట అర్బన్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటాలకు సిద్ధం కావాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పల్లా వెంకట్ రెడ్డి అన్నారు. శుక్రవారం సూర్యాపేట పట్టణంలో బూర వెంకటేశ్వర్లు అధ్యక్షతన ఏర్పాటు చేసిన జిల్లా కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆపరేషన్ కగార్ పేరుతో బూటకపు ఎన్‌కౌంటర్లు చేస్తూ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తుందని, మావోయిస్టులతో చర్చలు జరిపి ఆపరేషన్ నిలిపివేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన పేదలందరికీ ఇంటి స్థలాలతో పాటు ఇందిర ఇళ్లు ఇవ్వాలన్నారు. జూన్ 8న సీపీఐ జిల్లా మహాసభలను జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గన్న చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, కార్యవర్గ సభ్యులు ఎల్లవుల రాములు, ఉస్తెల నారాయణరెడ్డి, ధూళిపాల ధనుంజయ నాయుడు, మేకల శ్రీనివాసరావు, కృష్ణారెడ్డి, మండవ వెంకటేశ్వర్లు, ఎల్లంల యాదగిరి, పోకల వెంకటేశ్వర్లు, హనుమంతరావు, గుండు వెంకటేశ్వర్లు, దేవరం మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయంలో ఆధునికతను జోడించాలి


మాట్లాడుతున్న వరి పరిశోధన శాస్త్రవేత్త డాక్టర్ మానస

కోదాడరూరల్ : వ్యవసాయంలో ఆధునికతను జోడించి రైతు సాధికారత సాధించడమే కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వికసిత కృషి సంకల్ప అభియాన్ లక్ష్యమని భారత వరి పరిశోధన శాస్త్రవేత్త డాక్టర్ మానస తెలిపారు. శుక్రవారం కోదాడ మండల పరిధిలోని గణపవరం, చిమిర్యాలలో కేవీకే గడ్డిపల్లి ఆధ్వర్యంలో నిర్వహించిన వికసిత్ సంకల్ప అభియాన్ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. వానాకాలం సాగులో సుస్థిరమైన సాగు పద్ధతులు, శాస్త్రీయతపై రైతులకు అవగాహన కలిగించారు. పంటల ఉత్పత్తి, నేల ఆరోగ్యం, వనరుల నిర్వహణ మెరుగుపరచడంపై రైతులు దృష్టి సారించాలన్నారు. భూసార పరీక్షల ఆధారంగా కావాల్సిన మోతాదులో మాత్రమే ఎరువులు, మందులను వినియోగించాలన్నారు. నేరుగా వరి విత్తనాలు విత్తే విధానంపై రైతులు అవగాహన పెంచుకొని తక్కువ శ్రమ, పెట్టుబడితో ఎక్కువ దిగుబడులు సాధించాలని కోరారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు కిరణ్, ఎంఏట రజిని, ఏఈఓ ఝాన్సీ, మహేష్, డాక్టర్ కవిరాజు రైతులు సీతరాంరెడ్డి, సత్యనారాయణ, నరసింహరావు, నారపురెడ్డి, వెంకటేశ్వరరావు, గోపిరెడ్డి, రాములు, కన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్పాన్సర్‌షిప్‌కు శశాంక్ ఎంపిక


శశాంక్‌ను అభినందిస్తున్న పుల్లెల గోపీచంద్

మిర్యాలగూడ: స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా, ఖేలో ఇండియా టాలెంట్ ఐడెంటిఫికేషన్ అండ్ డెవలప్‌మెంట్‌లో భాగంగా అత్యుత్తమ ప్రదర్శన కనబరిచే క్రీడాకారులకు ఇచ్చే స్పాన్సర్‌షిప్‌కు మిర్యాలగూడ పట్టణానికి చెందిన వనమాల శశాంక్ ఎంపికయ్యారు. నల్లగొండ జిల్లా బ్యాడ్మింటన్ కోచ్ రామకృష్ణ శుక్రవారం తెలిపారు. శశాంక్ ప్రస్తుతం పుల్లెంల గోపీచంద్ వద్ద శిక్షణ పొందుతున్నాడు. 2024లో ఏబీసీ ఏసియన్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ ఇండియా తరుపున చైనాలో రిప్రజెంట్ చేశారు.

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

యాదగిరిగుట్ట: యాదగిరి కొండకు దిగువన నూతనంగా నిర్మిస్తున్న అన్నదాన సత్ర భవనం వెనుక భాగంలో గల గ్యాస్ గోడౌన్ గ్రిల్స్‌కు ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. యాదగిరిగుట్ట మున్సిపాలిటీలోని యాదగిరిపల్లికి చెందిన పొన్నం రాములు (39) కూలీ పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. గత కొంతకాలంగా కూలీ పని చేయగా వచ్చిన డబ్బులతో ప్రతిరోజు మద్యం తాగుతున్నాడు. గురువారం సాయంత్రం 6గంటల సమయంలో మద్యం సేవించి ఇంటికి వెళ్లిన రాములు ఇంట్లో ఉన్న ఫ్యాన్‌కు ఉరేసుకునేందుకు యత్నించాడు. అతడి భార్య సుజాత చూసి కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు వచ్చి అతడిని కాపాడారు. శుక్రవారం తెల్లవారుజామున 6గంటల సమయంలో సుజాత లేచి చూడగా భర్త కనిపించలేదు. పని కోసం బయటకు వెళ్లాడని కుటుంబ సభ్యులు భావించారు. సుమారు 9.40గంటల సమయంలో రాములు యాదగిరి కొండకు దిగువన నూతనంగా నిర్మిస్తున్న అన్నదాన సత్ర భవనం వెనుక భాగంలోని గ్యాస్ గోడౌన్ గ్రిల్స్‌కు ఉరి వేసుకున్నాడని కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడకు చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ భాస్కర్ తెలిపారు. తన భర్త రాములు ఆత్మహత్యపై ఎలాంటి అనుమానం లేదని, మద్యానికి బానిసై ఉరి వేసుకున్నాడని భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ భాస్కర్ వెల్లడించారు.

గడ్డిమందు తాగి వ్యక్తి ఆత్మహత్యాయత్నం

పెన్‌పహాడ్: గడ్డిమందు తాగి వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన గురువారం పెన్‌పహాడ్ పోలీస్ స్టేషన్ సమీపంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ గోపికృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని దోసపహాడ్ గ్రామానికి చెందిన దొంగరి నాగార్జున తనకు కట్నం కింద ఇచ్చిన ఎకరన్నర వ్యవసాయ పొలాన్ని అమ్ముకొని రావాలని తరచూ భార్యతో ఘర్షణ పడేవాడు. వేధింపులు తాళలేక అతడి భార్య అనూష గురువారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఎస్‌ఐ వారిని స్టేషన్‌కు పిలిచి కౌన్సిలింగ్ ఇస్తున్న క్రమంలో నాగార్జున బయటకు వచ్చి స్టేషన్ సమీపంలో తన వెంట తెచ్చుకున్న గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన స్థానికులు అతడిని చికిత్స నిమిత్తం సూర్యాపేట ఆస్పత్రికి తరలించారు. కానిస్టేబుల్ మహేష్ ప్రోత్సలంతో ఎస్‌ఐ గోపికృష్ణ తనను కొట్టాడని బాధితుడు ఆరోపించాడు. ఈ ఘటనపై ఎస్‌ఐ గోపికృష్ణను వివరణ కోరగా నాగార్జునపై అతని భార్య ఫిర్యాదు చేయగా స్టేషన్‌కు పిలిచి కౌన్సిలింగ్ ఇచ్చామని అతడిని కొట్టలేదని ఎస్‌ఐ తెలిపారు. భార్య ఫిర్యాదు మేరకు వరకట్నం వేధింపుల కింద కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

కల్తీ ఇంజన్ ఆయిల్ వ్యాపారి అరెస్టు


కేసు వివరాలు వెల్లడిస్తున్న సూర్యాపేట ఎస్పీ నరసింహ

- నిందితుడి నుంచి రూ.2లక్షల విలువైన కల్తీ ఆయిల్‌తోపాటు, కారు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఎస్పీ నరసింహ

సూర్యాపేటటౌన్ : కల్తీ ఇంజన్ ఆయిల్ తయారు చేసే వ్యాపారిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. శుక్రవారం సూర్యాపేటలోని జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కేసు వివరాలను ఎస్పీ నరసింహ వెల్లడించారు. శుక్రవారం రామాపురం క్రాస్ రోడ్డు వద్ద సీసీఎస్, కోదాడ రూరల్ పోలీసులు తనిఖీలు చేస్తుండగా కల్తీ ఇంజన్ ఆయిల్ బాటిల్స్‌తో వ్యాపారి పట్టుబడ్డాడు. అతడిని విచారించగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విజయవాడకు చెందిన కాకాని నాగ వెంకటేశ్వరరావుగా గుర్తించారు. అతడు విజయవాడలోని ఓ ఇంజన్ ఆయిల్ కంపెనీలో ల్యాబ్ టెక్నీషియన్‌గా పని చేశాడు. ఇంజన్ ఆయిల్ తయారీలో అనుభవం ఉన్న నాగ వెంకటేశ్వరరావు సులభంగా డబ్బులు సంపాదించాలని అనుకున్నాడు. ఈక్రమంలో కలకత్తా నుంచి ప్రముఖ కంపెనీలకు చెందిన ఆయిల్ డబ్బాల స్టిక్కర్లు, లేబుల్స్, ప్లాస్టిక్ టిన్స్ తెప్పించాడు. విజయవాడలో దొరికే మడ్డి ఆయిల్ ఫిల్టర్ చేసే వారి నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేసి విజయవాడలో తన ఇంటి వద్దనే లీటర్ ప్లాస్టిక్ బాటిల్స్‌లో నింపి స్టిక్కర్లు అతికించి లీటర్ రూ.200 చొప్పున బైక్ మెకానిక్‌లకు విక్రయించడం ప్రారంభించాడు. 2007లో విజయవాడలోని తన ఇంటిలో కల్తీ ఇంజన్ ఆయిల్‌ను బాటిల్స్‌లో నింపుతుండగా విజయవాడ వన్ టౌన్ పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేశాడు. రెండు రోజులు విజయవాడ జైల్లో ఉన్నాడు. తర్వాత వ్యాపారం బంద్ చేశారు. మళ్లీ కల్తీ ఇంజన్ ఆయిల్ తయారుచేయాలని నిర్ణయించుకున్నాడు. ఆయిల్ బాటిల్స్‌ను కారులో వేసుకుని నేరేడుచర్ల, మిర్యాలగూడ బైక్ మెకానిక్‌లకు అమ్ముతున్నాడు. శుక్రవారం ఉదయం కారులో కల్తీ ఇంజన్ ఆయిల్ బాటిల్స్‌తో రామాపురం క్రాస్ రోడ్డు వద్దకు వస్తుండగా సూర్యాపేట సీసీఎస్ పోలీసులు, కోదాడ రూరల్ పోలీసులు తనిఖీ చేసి పట్టుకున్నారు. అతడి నుంచి రూ.2లక్షల విలువైన ఆయిల్‌తోపాటు, కారును స్వాధీనం చేసుకున్నారు. వ్యాపారిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పీ తెలిపారు. నిందితుడిని పట్టుకున్న సీసీఎస్ సీఐ శివ, సిబ్బంది, కోదాడ రూరల్ సీఐ రజితరెడ్డి, సిబ్బందిని ఎస్పీ అభినందించారు. సమావేశంలో అదనపు ఎస్పీ రవీందర్‌రెడ్డి, డీఎస్పీ ప్రసన్నకుమార్, కోదాడ రూరల్ సీఐ రజితరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

చౌటుప్పల్ రూరల్: చౌటుప్పల్ మండలం తుప్రాన్‌పేట గ్రామ పరిధిలోని ఖాళీ స్థలంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు చౌటుప్పల్ సీఐ మన్మథ కుమార్ తెలిపారు. విజయవాడ- హైదరాబాద్ హైవే పక్కన 100మీటర్ల దూరంలో మృతదేహం ఉన్నట్లు స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటన స్థలానికి పోలీసులు వెళ్లి చూడగా సుమారు 35సంవత్సరాల వయసు ఉన్న ఓ వ్యక్తి మృతదేహం పూర్తిగా కుళ్లిపోయి ఉంది. సుమారు మూడు రోజుల క్రితం మృతి చెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. ఆత్మహత్య చేసుకున్నాడా.. లేక ఎవరైనా హత్య చేశారా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. మృతదేహాన్ని చౌటుప్పల్ ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించినట్లు సీఐ తెలిపారు.


భద్రతా లోపం ఏమీ లేదు

- ఎస్‌పీఎఫ్ ఆర్ఐ శేషగిరిరావు


యాదగిరి కొండపైన విలేకరులతో మాట్లాడుతున్న ఎస్‌పీఎఫ్ ఆర్ఐ శేషగిరిరావు

యాదగిరిగుట్ట: యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయ ప్రసాద తయారీ కేంద్రం నుంచి చింతపండు దొంగతనం జరిగిన ఘటనలో ఎస్‌పీఎఫ్ పోలీసుల భద్రతా లోపం ఏమీ లేదని, ఆలయ పరిసరాల్లో ఎస్‌పీఎఫ్, హోంగార్డులతో పటిష్ట బందోబస్తు ఉందని ఎస్‌పీఎఫ్ ఆర్ఐ శేషగిరిరావు అన్నారు. యాదగిరి కొండపైన శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దొంగతనం జరిగిన రోజు రాత్రి 8.20గంటలకు ఇద్దరు వ్యక్తులు ఓ కారులో వచ్చారని, అర్ధరాత్రి 2గంటల తరువాత కారును శివాలయం సమీపంలోని ప్రసాదం టిక్కెట్ కౌంటర్ సమీపంలో పార్కింగ్ చేశారన్నారు. ఆ సమయంలోనే చింతపండు బస్తాలను కారులో పెట్టారని, ఈ క్రమంలో పెట్రోలింగ్ సిబ్బంది ఆ ప్రాంతానికి వెళ్తున్న సమయంలో ఇద్దరు వ్యక్తులు తప్పించుకునే ప్రయత్నం చేశారని, వెంటనే అక్కడ పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులు ఇద్దరిని పట్టుకొని విచారించగా చింతపండు దొంగతనం చేసినట్లు తెలిపారన్నారు. దొంగలను పట్టుకున్నది భద్రతా సిబ్బందేనని, ఇందులో భద్రత లోపం ఏమీ లేదన్నారు. సమావేశంలో ఎస్‌పీఎఫ్ ఎస్ఐ అనిల్, ఏఎస్ఐ మాణిక్‌ప్రభు ఉన్నారు.

తాటి చెట్టు పైనుంచి పడి వ్యక్తి మృతి


వెంకటేశం (ఫైల్)

వలిగొండ : ప్రమాదవశాత్తు తాటి చెట్టు పైనుంచి పడి వ్యక్తి మృతిచెందిన ఘటన వలిగొండ మండలంలోని వెల్వర్తిలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని వెల్వర్తికి చెందిన గీత కార్మికుడు కొమ్మగాని వెంకటేశం (48) శుక్రవారం కల్లు గీయటానికి తాటి చెట్టు ఎక్కాడు. ప్రమాదవశాత్తు జారి పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. పక్క పొలంలోని రైతు ప్రమాదాన్ని గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చాడు. వారు ఘటనా స్థలానికి వెళ్లి 108 అంబులెన్స్‌లో భువనగిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు చెప్పారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై యుగంధర్ తెలిపారు.

ఉద్యోగం ఇప్పిస్తానని డబ్బులు వసూలు


- నిందితుడి అరెస్ట్


నూతనకల్ : ఉద్యోగం ఇప్పిస్తానని డబ్బులు వసూలు చేసిన వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. శుక్రవారం సీఐ నర్సింహారావు తెలిపిన వివరాల ప్రకారం.. నూతనకల్ మండల పరిధిలోని వెంకెపల్లి గ్రామానికి చెందిన దాసరి మహేష్‌కు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పల్నాడు జిల్లా మాచర్లకు చెందిన ఏసీ మెకానిక్, వోల్వో బస్సు డ్రైవర్‌గా పనిచేస్తున్న మాదాసు వరప్రసాద్ ఫేస్‌బుక్ ద్వారా పరిచయమయ్యాడు. మహేష్ తమ్ముడు సతీష్‌కు ఓల్వో బస్ డ్రైవింగ్ నేర్పించి డ్రైవర్‌గా జాబ్ ఇప్పిస్తానని వరప్రసాద్ ఫోన్‌లో తెలిపాడు. ఈమేరకు రూ.4లక్షల 30వేలు తన ఫోన్‌పే ఖాతాలోకి కొట్టించుకున్నాడు. ఉద్యోగ విషయమై పలుమార్లు మహేష్ వరప్రసాద్‌ను అడగగా సరైన సమాధానం చెప్పకుండా తప్పించుకొని తిరుగుతున్నాడు. తనకు జరిగిన మోసంపై మహేష్ స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసుల సలహా మేరకు తప్పకుండా ఉద్యోగం ఇప్పించాలని మరికొంత డబ్బు ఇస్తానని, సూర్యాపేటకు రావాలని మహేష్ చెప్పాడు. నిందితుడు సూర్యాపేట కొత్తబస్టాండ్‌కు రావడంతో పోలీసులు పట్టుకొని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. ఆయన వెంట ట్రైనీ ఎస్ఐ గోపాల్‌రెడ్డి ఉన్నారు.

టైరు పంక్చరై ప్రైవేట్ బస్సు దగ్ధం

మోతె: టైరు పంక్చరై ప్రైవేట్ బస్సు దగ్ధమైన సంఘటన మోతె మండల పరిధిలో హుస్సేనాబాద్ వద్ద ఖమ్మం–సూర్యాపేట జాతీయ రహదారిపై శుక్రవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. గురువారం రాత్రి హైదరాబాద్ నుంచి పాల్వంచకు 3 ప్రైవేట్ బస్సులు బయలుదేరాయి. ఈ బస్సులు మోతె మండలంలో హుస్సేనాబాద్ గ్రామానికి చేరుకున్న క్రమంలో వాటిలో ఒక బస్సు టైరు పంక్చర్ అయ్యింది. దీంతో ఒక్క సారిగా బస్సులో మంటలు ఏర్పడ్డాయి. గమనించిన డ్రైవర్ బస్సులో నుంచి కిందికి దూకి పోలీసులకు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చాడు. ఫైర్ ఇంజన్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని మంటలు ఆర్పారు. బస్సు యజమాని పీసీఆర్ ట్రాన్స్‌పోర్టు మేనేజర్ పోతుగంటి వంశీరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు మోతె ఎస్ఐ యాదవేందర్‌రెడ్డి తెలిపారు.

రజాకార్, మల్లేశం సినిమాలకు గద్దర్ అవార్డులు





- చేనేత ఇతివృత్తంగా మల్లేశం సినిమా
- తెలంగాణ సాయుధ పోరాట నేపథ్యంలో వచ్చిన రజాకార్

సాక్షి, యాదాద్రి : ప్రజా గాయకుడు గద్దర్ పేరిట రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన సినీ అవార్డుల్లో యాదాద్రి భువనగిరి జిల్లా నేపథ్యం కలిగిన రెండు సినిమాలకు అవార్డులు దక్కాయి. తెలంగాణ సాయుధ పోరాట నేపథ్యంలో తీసిన రజాకార్ సినిమా ఉత్తమ చారిత్రాత్మక చిత్రంగా, చేనేత ఇతివృత్తంగా తీసిన మల్లేషం సినిమాకు జ్యూరీ కమిటీ అవార్డులు ప్రకటించింది. జిల్లాకు చెందిన వ్యక్తుల నేపథ్యం కలిగిన రెండు సినిమాలకు అవార్డులు రావడం పట్ల సినీ ప్రేమికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

చారిత్రక చిత్రంగా రజాకార్

తెలంగాణ సాయుధ పోరాట చరిత్ర నేపథ్యంలో రజాకార్ సినిమా తీశారు. బీబీనగర్ మండలం గూడూరుకు చెందిన బీజేపీ నాయకుడు గూడూరు నారాయణరెడ్డి ఈ చిత్ర నిర్మాత. నల్లగొండకు చెందిన యాట సత్యనారాయణ డైరెక్టర్‌గా వ్యవహరించారు. బీబీనగర్ మండలం మహదేవ్‌పూర్ పరిసర ప్రాంతాల్లో ఈ సినిమా తీశారు. ఉమ్మడి నల్లగొండ, వరంగల్, అదిలాబాద్ పలు జిల్లాల్లో 1947 నుంచి 1948 వరకు జరిగిన తెలంగాణ సాయుధ పోరాట సంఘటల ఆధారంగా సినిమా చిత్రీకరించారు.

ఆసుయంత్రం తయారీ ఇతివృత్తంగా..

ఆసు యంత్రాన్ని తయారు చేయడానికి మల్లేశం పడిన శ్రమను ఇతి వృత్తంగా తీసుకుని మల్లేశం సినిమా తీశారు. ఆలేరు మండలం శారాజీపేట గ్రామానికి చెందిన చింతకింది మల్లేశం చేనేత కుటుంబానికి చెందిన వ్యక్తి. ఆసుయంత్రం సృష్టికర్తగా మల్లేశం పద్మశ్రీ అవార్డు అందుకున్నారు. అదేవిధంగా రాష్ట్రపతి అబ్దుల్ కలాం అవార్డు అందుకున్నారు.

మల్లేశం సినిమాకు అవార్డు రావడం ఆనందంగా ఉంది



మల్లేశం సినిమా తెలంగాణ గద్దర్ అవార్డుకు ఎంపిక కావడం ఆనందంగా ఉంది. ఈ సినిమాకు దర్శకత్వం, నిర్మాత, కథ స్క్రీన్ ప్లే వహించిన రాజు రాచకొండకు, నటీ, నటీమణులకు, సినిమా నిర్మాణంలో పనిచేసిన వారందరికీ కృతజ్ఞతలు. గద్దర్ అవార్డులు ఇస్తున్న తెలంగాణ ప్రభుత్వానికి ధన్యవాదాలు.
– చింతకింది మల్లేశం

తెలంగాణ సాయుధ పోరాటానికి దక్కిన గౌరవం



చారిత్రాత్మక చిత్రం కేటగిరిలో రజాకార్ సినిమాకు అవార్డు రావడం ఆనందంగా ఉంది. ఇది తెలంగాణ సాయుధ పోరాటానికి దక్కిన గౌరవం. చరిత్రను పరిచయం చేసిన చిత్రంగా ఈ సినిమా నిలిచిపోతుంది.
– గూడూరు నారాయణరెడ్డి, రజాకార్ చిత్ర నిర్మాత